ఫుడ్‌పాయిజన్‌తో చనిపోయిన విద్యార్థిని శైలజ కుటుంబానికి సాయం అందిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఆసిఫాబాద్ జిల్లా గోలేటిలో కార్మికులతో కలిసి నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, కార్మిక నేతలు

ప్రజల పక్షాన కొట్లాడితే అక్రమ కేసులా?

- రేవంత్ మాట నిలబెట్టుకోలేక.. ప్రతిపక్ష నాయకులపై కుట్రలు
- కేటీఆర్‌పై కక్షపూరిత కేసులు
- కేసీఆర్ సైనికులం.. భయపడం
- రైతు భరోసా 15 వేలు ఇవ్వాలి
- జైనూర్ ఘటనలో నష్టపోయిన అందరికీ న్యాయం చేయాలి
- శైలజ కుటుంబానికి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలి
- ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల పర్యటనలో కల్వకుంట్ల కవిత
- బాధిత కుటుంబాలకు 2 లక్షల చొప్పున సాయం

"మేం కేసీఆర్ సైనికులం. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు. ప్రజల పక్షాన, ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తూనే ఉంటాం. -ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత"

మంచిర్యాల, జనవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పాలనలో రైతులు, మహిళలు, బహుజనులు, దళితులు, గిరిజనులు, ఆదివాసీ వర్గాలన్నింటికీ అన్యాయం జరుగుతున్నదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎవరైనా గొంతెత్తి బాధితుల పక్షాన మాట్లాడితే, ప్రజల పక్షాన ప్రశ్నిస్తే రేవంత్‌రెడ్డి సర్కార్ అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నదని మండిపడ్డారు. కేటీఆర్‌పై రకరకాల కేసులు పెట్టి, ఏసీబీ పేరుతో కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఎమ్మెల్సీ కవిత పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ సర్కార్ ప్రజలకు ఇచ్చినమాట నిలబెట్టుకోలేక ప్రతిపక్ష పార్టీ నాయకులపై కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తున్నదని, కేటీఆర్‌పై కేసులు అందులో భాగమేనని చెప్పారు.

జైనూర్ ఘటనలో సర్కార్‌ది మొద్దునిద్ర

తెలంగాణలో కేసీఆర్ అద్భుతమైన గురుకులాలు ఏర్పాటుచేశారని వాటిని సక్కగా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని కవిత పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో ఆడబిడ్డలకు కల్పించిన రక్షణలను ప్రభుత్వం కొనసాగించాల్సి ఉన్నదని, కానీ, దానికి విరుద్ధంగా ఆసిఫాబాద్‌లో రెండు ఘటనలు జరిగాయని ఆవేదన వ్యక్తంచేశారు. జైనూర్‌లో మహిళపై దాడి చేసి, లైంగికదాడికి యత్నం జరిగితే.. ప్రభుత్వ పెద్దలు ఎవరూ బాధ్యతగా నిలబడి, ప్రజలకు ధైర్యం చెప్పేందుకు ప్రయత్నించలేదని మండిపడ్డారు. ఆ కారణంగానే హింస చెలరేగి పెద్ద ఎత్తున విధ్వంసం జరిగిందని చెప్పారు. ఈ ఘటనలో అన్ని వర్గాల ప్రజల దుకాణాలు పాడైపోయాయని, ఆస్తినష్టం జరిగిన ఏ ఒక్కరికీ ప్రభుత్వం నుంచి రూపాయి రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం మొద్దునిద్ర ఎందుకు పోతున్నదని ప్రశ్నించారు. జైనూర్ ఘటనలో నష్టపోయిన అన్ని వర్గాలవారికి తమ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. షాపులు కాలిపోయిన అందరికీ న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శైలజ కుటుంబానికి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి

వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్‌తో విద్యార్థిని శైలజ చనిపోయినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. శైలజ హైదరాబాద్ నిమ్స్‌లో ఉన్నప్పుడు తాను వెళ్లి పరామర్శించానని, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో విషాహారం తిని చనిపోయిన పిల్లలకు రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశామని గుర్తుచేశారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో బాధితురాలికి రూ.2లక్షలు ఇస్తామని తామే ప్రకటించామని వివరించారు. తాము అక్కడ ప్రకటించగానే ఆగమేఘాల మీద శైలజ ఇంటికి వచ్చి రూ.రెండు లక్షలు ఇస్తామని, ఆమె తండ్రికి కాంట్రాక్ట్ ఉద్యోగం ఇస్తామని చెప్పారని తెలిపారు. కానీ, ఇప్పటివరకు ఆయనకు కాగితం కూడా ఇవ్వలేదని చెప్పారు. శైలజతోపాటు రాష్ట్రంలో 55 మంది పిల్లలు చనిపోతే వారికి న్యాయం చేయడంలో రేవంత్ సర్కార్ విఫలమైందని మండిపడ్డారు. రేవంత్ పాలనలో ఉద్యోగులందరూ ఇబ్బందులు పడుతున్నారని, సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మె చేస్తుంటే కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. చాయ్ తాగినంత సమయంలో రెగ్యులరైజ్ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డికి.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి సమయం దొరక్కపోవడం, మనసు రాకపోవడం దారుణమని మండిపడ్డారు. కేజీబీవీల్లోని ఉపాధ్యాయులు, సర్వశిక్షా అభియాన్ ఉపాధ్యాయులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపానికి నివాళులు

ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అక్కడినుంచి నార్నూర్ క్రాస్ రోడ్డు మీదుగా జైనూర్ మండలం దేవుగూడ గ్రామానికి వెళ్లారు. జైనూర్ ఘటనలో బాధితురాలైన ఆదివాసీ మహిళ మెస్రం నీలాబాయి కుటుంబాన్ని పరామర్శించారు. పూరిగుడిసెలోకి వెళ్లి మరీ ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యం అందుతున్న తీరు, ప్రభుత్వ సహాయ సహకారాలపై ఆరా తీశారు. బాధిత కుటుంబానికి రూ.రెండు లక్షల చెక్కును అందజేశారు. అక్కడినుంచి ప్రమాదంలో గాయపడి నాలుగేండ్లుగా ఇబ్బందులు పడుతున్న జామ్ని మాజీ ఎంపీటీసీ, తెలంగాణ ఉద్యమకారుడు లట్‌పటే మాధవ్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అనంతరం కెరిమెరి మీదుగా వాంకిడి మండలం దాబా గ్రామానికి బయలేరి వెళ్లారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో విషాహారం తిని మృతిచెందిన శైలజ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తుండగా వాంకిడి సమీపంలో కవిత కాన్వయ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ నాయకుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. శైలజ చదువుకున్న ఆశ్రమ పాఠశాల ముందు నుంచి కాన్వాయ్ వెళ్లడానికి అనుమతి నిరాకరించిన పోలీసులు, వేరే మార్గంలో ఆమెను దాబా గ్రామానికి తీసుకెళ్లారు. శైలజ కుటుంబసభ్యులను పరామర్శించిన కవిత రూ.2 లక్షల చెక్కును ఆర్థిక సాయంగా అందజేశారు. పరామర్శకు వెళ్లిన సమయమంలో శైలజ తల్లి కవితను హత్తుకొని బోరున విలపించారు.

బైక్ ర్యాలీలు.. ఘన స్వాగతాలు..

ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఎమ్మెల్సీ కవిత పర్యటన సందర్భంగా అడుగడుగునా బీఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. నర్నూర్‌క్రాస్ రోడ్‌చ జైనూర్, కెరిమెరి, ఆసిఫాబాద్ తదితర ప్రాంతాల్లో అద్భుతమైన రీతిలో స్వాగతం పలికారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకోగానే పూలవర్షం కురిపించి అభిమానాన్ని చాటుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్‌జాదవ్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఆదిలాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్, టీబీజీకేఎస్ నాయకుడు మిర్యాల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

"కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ద్వారా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు రూ.12 వేలకు తగ్గించింది. రైతులకు రూ.15 వేలు ఇవ్వాల్సిందే. రూ.12 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటామంటే చూస్తూ ఊరుకోం. -ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత"

టీబీజీకేఎస్‌కు పూర్వ వైభవం

సింగరేణిలో టీబీజీకేఎస్‌కు పూర్వవైభవం వస్తుందని ఎమ్మెల్సీ కవిత ధీమా వ్యక్తంచేశారు. ఆసిఫాబాద్ పర్యటనలో భాగంగా సోమవారం రాత్రి గోలేటిలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో కవిత మాట్లాడుతూ.. తెలంగాణ అంటేనే సింగరేణి అని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ కారుణ్య నియామకాలను పునరుద్ధరించారని చెప్పారు. ప్రైవేటీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ఎంత ఒత్తిడి తెచ్చినా ఒప్పుకోలేదని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఎలా మోసం చేసిందో, సింగరేణి కార్మికులను అధికార పార్టీ కార్మిక సంఘాలు అంతకంటే ఎక్కువగా మోసం చేశాయని ఎద్దేవా చేశారు. బోనస్ విషయంలో 50% కోత పెట్టి కార్మికుల పొట్ట కొట్టినా గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నోరుమెదపడం లేదని దుయ్యబట్టారు.

2,060 ఆచార్యుల పోస్టులు ఖాళీ

- ఏడాదిలో 100 మందికి పైగా ఆచార్యులు రిటైర్
- పనిచేస్తున్నది 757 మంది
- బోధనా సిబ్బంది కొరతతో వర్సిటీలు కుదేలు

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని వర్సిటీల్లో ఆచార్యుల కొరత వేధిస్తున్నది. కొత్త రిక్రూట్‌మెంట్లు లేకపోవడం, ఉన్న వారు రిటైర్డ్ అవుతుండటంతో ఖాళీ పోస్టులు దర్శనమిస్తున్నాయి. 12 వర్సిటీల్లో 2,817 టీచింగ్ పోస్టులుంటే 2,060 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నిరుడు ఖాళీల సంఖ్య 1,977 ఉండగా, ఏడాదిలో 2వేలు దాటాయి. ఇందులో అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాదిలో వందకు పైగా ఆచార్యులు రిటైర్ అయ్యారు. ఓయూలో 53 విభాగాలుండగా, 900 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 27 విభాగాలున్న కేయూలో 80 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇటీవలే ఏర్పాటైన చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీలో 25 మంది పనిచేస్తున్నారు. 179 టీచింగ్ పోస్టులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. జేఎన్టీయూకు అనుబంధంగా వనపర్తి, పాలేరు, సిరిసిల్ల, మహబూబాబాద్‌లో కొత్తగా ఇంజినీరింగ్ కాలేజీలు ఏర్పాటయ్యాయి. పాలమూరు వర్సిటీల్లో ఇంజినీరింగ్, లా కాలేజీలను ప్రారంభించారు. దీంతో మరో వెయ్యి వరకు కొత్త పోస్టులను మంజూరు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. రిక్రూట్‌మెంట్‌పై ప్రభుత్వం ఏదీ తేల్చడంలేదు. వర్సిటీల వారీగానా.. ? కామన్‌బోర్డా? అన్నది చెప్పడంలేదు. పలు వర్సిటీలకు రిజిస్ట్రార్లను నియమించలేదు. త్రిసభ్య కమిటీని కసరత్తు పూర్తయ్యి స్పష్టత వచ్చే వరకు మరికొంత సమయం పట్టనుంది. ఈ మధ్యకాలంలో మరికొంత మంది రిటైర్ కానున్నారు.

పరీక్షలయ్యాకే సెకండియర్ సిలబస్ బోధన

వెల్లడించిన ఎస్సీ గురుకుల సొసైటీ

హైదరాబాద్, జనవరి6 (నమస్తే తెలంగాణ): ఫస్టియర్ పరీక్షలు పూర్తయ్యాకే సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ల్లో(సీవోఈ) సెకండియర్ సిలబస్ బోధన ప్రారంభించాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ నిర్ణయించింది. సొసైటీ పరిధిలోని 38 సీఈవోల్లో విద్యార్థులకు ఇంటర్ విద్యతోపాటు, సమానంగా జేఈఈ, నీట్ పరీక్షలకు సైతం శిక్షణ అందిస్తున్నది. ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు పూర్తయ్యాక సెకండియర్ సిలబస్ బోధిస్తారు. కానీ పరీక్షలు పూర్తికాకముందే ఈ నెల నుంచే ఫస్టియర్ విద్యార్థులకు సెకండియర్ సిలబస్ బోధించాలని అధికారులు నిర్ణయించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు అభ్యంతరం తెలిపారు. 'నమస్తే తెలంగాణ'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఎట్టకేలకు సొసైటీ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. ఫస్టియర్ పరీక్షలు పూర్తయ్యాకనే సెకండియర్ సిలబస్ బోధించాలని సీఈవో ప్రిన్సిపాల్స్, అధ్యాపకులకు ఆదేశాలు జారీ చేసింది.

నమస్తే ఎఫెక్ట్

వీసీలు మళ్లీ దరఖాస్తు చేయొద్దు

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : యూనివర్సిటీల వీసీల ఎంపికపై యూజీసీ స్పష్టత ఇచ్చింది. వీసీగా కొనసాగుతున్న వారు మళ్లీ వీసీ పోస్టుకు దరఖాస్తు చేయడంతోపాటు అదే వీసీ సెర్చ్ కమిటీ సభ్యుడి ఎంపికను చేపడితే అనర్హత వేటు పడుతుందని స్పష్టంచేసింది. పాలకమండలి నామినిలు సైతం పాత వీసీల కోసం పట్టుబట్టిన ఘటనల నేపథ్యంలోనే ఇలాంటి వారిపై అనర్హత వేటు వేయవచ్చని యూజీసీ తెలిపింది. జాతీయ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ఫ్యాకల్టీ నియామకానికి కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల నిర్వహణకు నిబంధనలు-2025 పేరుతో డ్రాఫ్ట్ మార్గదర్శకాలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ ఢిల్లీలో విడుదల చేశారు. వైస్‌చాన్స్‌లర్ల పదవీకాలం ఐదేండ్లు ఉంటుందని యూజీసీ వెల్లడించింది. లేదా 70 ఏండ్ల వయసు వచ్చే వరకు వారు పదవిలో కొనసాగవచ్చని తెలిపింది. మన రాష్ట్రంలో వీసీల పదవి కాలపరిమిది మూడేండ్లుగా ఉంది. యూజీసీ మార్గదర్శకాలను రాష్ట్రంలో అమలుచేయాల్సి వస్తే వీసీల పదవీకాలం మూడేండ్లకే పరిమితం చేస్తారా.? లేక ఐదేండ్లకు పెంచుతారా..? అన్నది సందిగ్ధంగా మారింది.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

ఎన్నికల కేసులో కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారన్న అభియోగంతో 2023 నవంబర్ 29న కమలాపుర్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో బీఆర్‌ఎస్ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఊరట లభించింది. ఈ కేసు విచారణ నిమిత్తం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాల్సిన అవసరం లేకుండా హైకోర్టు ఆయనకు మినహాయింపు ఇచ్చింది. కౌంటర్ దాఖలు నిమిత్తం ప్రతివాదులకు నోటీసులు జారీచేసి, తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేశారు.

అల్లు అర్జున్ సిబ్బంది బెయిల్‌పై తీర్పు వాయిదా

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో ముందస్తు బెయిల్ కోసం నటుడు అల్లు అర్జున్ మేనేజర్ ఏ శరత్ చంద్ర, పర్సనల్ సెక్యూరిటీ గార్డులు కృష్ణ, శ్రీరాములు దాఖలు పిటిషన్లపై సోమవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. దీంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని జస్టిస్ కే సుజన ప్రకటించారు. 'పుష్ప-2' సినిమా ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే వివాహిత మరణించడంతోపాటు ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. దీంతో ఈ ఘటనపై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

సుప్రీంను ఆశ్రయించిన మోహన్‌బాబు

జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సినీ నటుడు మోహన్‌బాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ఆయనకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు ఇప్పటికే నిరాకరించింది. దీంతో హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆయన సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం విచారణ చేపట్టనున్నది.

రేవంత్ క్షమాపణలు చెప్పాలి

- తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారు
- ప్రభుత్వ ఉద్యోగులకు చేసిన మోసాన్ని దిద్దుకోవాలి
- ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ చైర్మన్ దేవీప్రసాద్

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రాన్నే అవమానించిన సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ డిమాండ్ చేశారు. వీరోచిత పోరాటాలు, విద్యార్థులు, యువకుల ఆత్మ బలిదానాలను, దేశ రాజకీయాలను ఒప్పించి, మెప్పించి కేసీఆర్ రాజనీతిజ్ఞతతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని కించపరిచేలా రేవంత్‌రెడ్డి వ్యవహరించడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత పదేండ్లలో రెండుసార్లు 73 శాతం పీఆర్సీ (తొలిసారి 43 శాతం, మరోసారి 30 శాతం) ఇచ్చి దేశంలోనే తెలంగాణ ఉద్యోగులను అగ్రభాగాన నిలిపిన ఘనత కేసీఆర్‌దే అనే విషయాన్ని రేవంత్‌రెడ్డి గుర్తు పెట్టుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆశా వర్కర్లకు, అంగన్‌వాడీ, ఐకేపీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచడమే కాకుండా రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయని చరిత్ర కాంగ్రెస్ పార్టీదని మండిపడ్డారు. కండ్ల ముందు కాంగ్రెస్ మోసం కనిపిస్తున్నా ఉమ్మడి రాష్ట్రంలోనే ఉద్యోగుల పరిస్థితి మెరుగైందన్నట్టుగా సీఎం వ్యాఖ్యానించడం శోచనీయమని పేర్కొన్నారు. సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను మోసం చేస్తున్నది కాంగ్రెస్ సర్కార్ కాదా? అని దేవీప్రసాద్ ప్రశ్నించారు.

చైనా మాంజా అమ్మినా, వాడినా జైలుకే

పీసీసీఎఫ్ ఆర్‌ఎం దోబ్రియాల్

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి వేడుకల్లో పతంగులతోపాటు పక్షులనూ ఎగరనిద్దామని అటవీ దళాల ప్రధాన సంరక్షణ అధికారి ఆర్‌ఎం డోబ్రియాల్ పిలుపునిచ్చారు. పతంగులు ఎగురవేసేందుకు కాటన్ దారాలను మాత్రమే వాడాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని అటవీశాఖ ప్రధాన కార్యాలయం అరణ్యభవన్‌లో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'చైనా మాంజాపై ప్రజలకు అవగాహన కల్పించి పక్షులని రక్షిద్దాం' అనే వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. చైనా మాంజా అమ్మినా, నిలువ చేసినా, రవాణా చేసినా ఐదేండ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. చైనా దారం అమ్మకం వివరాలు తెలిస్తే 040-23231440, 18004255364నంబర్లకు ఫోన్ చేసి తెలపాలని సూచించారు.

అంబులెన్స్‌కు దారేది?

- మంత్రులరాకతో పోలీసుల అతి ఆంక్షలు
- ట్రాఫిక్‌లో చిక్కుకున్న అత్యవసర వాహనం

సుబేదారి, జనవరి 6 : మంత్రుల పర్యటన అత్యవసర అంబులెన్స్ సేవలకు ఆటంకం కలిగించింది. పోలీసులు అతిగా వ్యవహరించడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగిని హాస్పిటల్‌కు తరలించే అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. ముగ్గురు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ సోమవారం హనుమకొండ హయగ్రీవాచారి మైదానంలో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమం తర్వాత మంత్రుల కాన్వాయ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డువైపు వెళ్తున్న క్రమంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. హనుమకొండ బస్‌స్టేషన్ వద్ద ట్రాఫిక్ జామ్ కావడంతో బాలసముద్రం వైపు వెళ్తున్న అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. డ్రైవర్ సైరన్ కొట్టినా ముందుకు వెళ్లలేనిస్థితి నెలకొంది. చాలాసేపు తర్వాత అంబులెన్స్ డ్రైవర్ వెనుకకు వచ్చి మరోదారిలో వెళ్లారు. ఈ పరిస్థితి చూసినవారు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభోత్సవ వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో డిప్యూటీ సీఎం భట్టి ఫొటో అతికిస్తున్న అధికారులు

ఫ్లెక్సీలో డిప్యూటీ సీఎం భట్టి ఫొటో మిస్

- ఆలస్యంగా గుర్తించిన వరంగల్ ఆర్టీసీ అధికారులు
- అప్పటికప్పుడు ఫొటో తీసుకొచ్చి అతికించిన సిబ్బంది
- ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం సందర్భంగా ఘటన

హనుమకొండ చౌరస్తా, జనవరి 6 : హనుమకొండలో ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం సందర్భంగా ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఫొటో మిస్సయ్యింది. వివరాల్లోకి వెళితే.. సోమవారం హనుమకొండలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించే కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానుండడంతో వారి ఫొటోలతో వేదికపై ఆర్టీసీ అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇందులో డిప్యూటీ సీఎం భట్టి ఫొటో లేకపోవడంతో కార్యక్రమానికి వచ్చినవారు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అప్రమత్తమైన వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు భానుకిరణ్, మాధవరావు, డిపో మేనేజర్ మోహన్‌రావు అప్పటికప్పుడు భట్టి ఫొటోను తీసుకొచ్చి ఫ్లెక్సీకి అతికించి హమ్మయ్య.. అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

9న కొత్త విద్యుత్తు పాలసీ

డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 9న రాష్ట్రంలో కొత్త విద్యుత్తు పాలసీని ప్రకటిస్తామని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క వెల్లడించారు. దేశ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ పాలసీ ఎంతగానో దోహదపడనున్నట్టు తెలిపారు. సోమవారం సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఇటీవల జెన్‌కోలో ఉద్యోగాలు పొందిన ఏఈలు, కెమిస్ట్‌లకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జీఎస్‌డీపీలో విద్యుత్తు రంగం కీలకపాత్ర పోషిస్తున్నదని తెలిపారు.

టీటీడీ లైజన్ ఆఫీసర్‌కు యాదగిరిగుట్ట వేతనం

యాదగిరిగుట్ట, జనవరి 6 : టీటీడీలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన లైజన్ ఆఫీసర్‌గా నియమించిన గణేశ్‌కుమార్‌కు యాదాద్రి దేవస్థానమే ప్రతి నెల రూ.లక్ష చొప్పున రెండేండ్లు లేక పదవీ కాలం పూర్తయ్యే వరకు చెల్లించాలని ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈవోతో పాటు, 1,050 మంది ఉద్యోగుల జీతాల కోసం నెలకు రూ.4 కోట్లు ఖర్చు భరించాల్సి ఉంటుంది.

చర్లపల్లి రైల్వే టర్మినల్ ప్రారంభోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

చర్లపల్లి రైల్వే టర్మినల్ జాతికి అంకితం

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం జాతికి అంకితం చేశారు. అత్యాధునిక సౌకర్యాలతో రూ.413 కోట్లతో నిర్మించిన ఈ టర్మినల్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ రైల్వే రంగంలో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. చర్లపల్లి టర్మినల్ ద్వారా సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లపై ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. ఇండియన్ రైల్వే కొత్తరూపు సంతరించుకున్నదని పేర్కొన్నారు. హైస్పీడ్ రైళ్ల కోసం డిమాండ్ పెరుగుతున్నదని వెల్లడించారు. వందేభారత్, అమృత్ భారత్, నమో భారత్ రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చామని స్పష్టంచేశారు. రైల్వేల ఆధునీకరణ దేశం ముఖచిత్రాన్నే మార్చేస్తున్నదని చెప్పారు. కొత్త రైల్వే ట్రాక్‌లతోపాటు అండర్ బ్రిడ్జిల నిర్మాణాలను వేగవంతం చేస్తున్నట్టు తెలిపారు. జమ్మూ రైల్వే డివిజన్, రాయగడ్‌లోని ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజన్ భవనాలకు శంకుస్థాపనలు చేశారు. ఆర్‌ఆర్‌ఆర్‌కు కేంద్రం సహకరించాలని ప్రధాని మోదీని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. చర్లపల్లి టర్మినల్ ప్రారంభోత్సవానికి ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులంలో 39 మంది ఐసీటీల తొలగింపు

హైదరాబాద్, జనవరి6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ పరిధిలోని గురుకులాల్లో పనిచేస్తున్న 39మంది ఐసీటీ(ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ) ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తొలగించారు. సొసైటీ ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. 238 గురుకులాల్లో విద్యార్థులకు కంప్యూటర్ విద్య బోధనకు ఔట్‌సోర్సింగ్, హానరోరియం వేతనాలపై గతంలోనే ఐసీటీలను నియమించారు. తాజాగా ఐసీటీలకు నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. అందులో 39మందికి కనీస నైపుణ్యాలు లేవని తేలగా, వారిని పూర్తిగా తొలగిస్తున్నట్టు సొసైటీ ప్రకటించింది. ఏండ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న తమను అర్ధాంతరంగా తొలగించడం దారుణమని బాధిత ఐసీటీలు మండిపడుతున్నారు. తమకు రావాల్సిన 3నెలల వేతన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్రంలో మందుల కొరత లేదు

మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): దవాఖానల్లో మందుల కొరత లేదని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్డీలో సోమవారం ఫార్మసీ, ఈ-ఔషధీ వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ జిల్లాలోనూ సెంట్రల్ మెడిసినల్ స్టోర్స్‌తో పాటు మందుల సరఫరాకు వాహనాలను సమకూర్చామని తెలిపారు. ఎక్కడైనా పేషెంట్ ఇబ్బంది పడినట్టు తమ దృష్టికి వస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఔషధ నిల్వల పరిశీలనకు ప్రతి జిల్లాలోనూ కమిటీని వేస్తున్నామని తెలిపారు. సూపరింటెండెంట్లు, ఆర్‌ఎంవోలు రోజూ పొద్దున్నే హాస్పిటల్‌లోని ఫార్మసీ స్టోర్‌ను తనిఖీ చేయాలని ఆదేశించారు.

హెచ్‌ఎంపీవీ కొత్త వైరస్ కాదు!

హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) కొత్తదేమీ కాదని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. 2001లోనే ఈ వైరస్ ఉనికిని కనుగొన్నారని, నాటి నుంచే ప్రపంచంలో పలు చోట్ల వ్యాప్తిలో ఉన్నదని పేర్కొన్నారు. ఈ వైరస్ శ్వాసకోశ వ్యవస్థపై స్వల్ప ప్రభావం చూపిస్తుందని తెలిపారు. వ్యాధి సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు అతని నోటి నుంచి వచ్చే తుంపర్ల ద్వారా మరొకరికి వైరస్ వ్యాపిస్తుందని చెప్పారు. ఇతర దేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో వైరస్ వ్యాప్తిని సమీక్షిస్తున్నామని, రాష్ట్ర అధికారులు కేంద్ర ఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ వైరస్ విషయంలో ప్రస్తుతానికి భయపడాల్సిన అవసరం లేదని, జాగ్రత్తగా ఉంటే సరిపోతుందని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా నిరాధార, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తే తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు. రాష్ట్రంలో అన్నిరకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, ఎటువంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం, వైద్యారోగ్య శాఖ సిద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు.